క్లుప్తంగా

రెజ్లర్ల అరెస్టును ఖండిస్తూ ర్యాలీ

ప్రకాశం నగర్: మహిళా రెజ్లర్లను వేధింపులకు గురిచేసిన డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించి అరెస్టు చేయాలని, అక్రమంగా అరెస్ట్ చేసిన మహిళా రెజ్లర్లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా, ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్, సీఐటీయూ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బైపాస్ రోడ్డులో ర్యాలీ చేశారు. ఐద్వా జిల్లా కార్యదర్శి పి.తులసి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.రాజా, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీమణి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజులోవ మాట్లాడుతూ రెజ్లర్లు తమకు న్యాయం చేయాలని, రక్షణ కల్పించాలని దాదాపు 40 రోజులుగా దేశ రాజధాని ఢిల్లీలో ఆందోళన చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు.

వ్యవసాయంపై అవగాహన

కడియం: చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కల్పించారు. లైబ్రేరియన్ శ్రీదేవి నిర్మల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆరుగాలం కష్టించి, సాగుచేసి మనకు ఆహారాన్ని సమకూరుస్తున్న రైతులను గౌరవించాలని సూచించారు. గ్రంథాలయ సభ్యులు ఉప్పులూరి చిట్టియ్య మాట్లాడుతూ సాగు విధానాలు, పంటలను వివరించారు. పేపరుమిల్లు ఉద్యోగి భాస్కరరావు మర్యాద రామన్న కథలు, రిసోర్స్ పర్సన్ వెంకటేశ్వర్లు అక్బర్ బీర్బల్ కథలు, రిషిత పార్లమెంటు విశేషాలు, కె.ప్రసాద్ క్రాఫ్ట్‌లో మెళకువలను తెలిపారు.

అభ్యంతరాలు ఉంటే తెలపండి

సీటీఆర్ఐ: గోరక్షణ పేటలోని గౌతమీ జీవ కారుణ్య సంఘానికి సంబంధించిన టీఎస్ నంబర్ 45-34-34లో సుమారు 250 గజాల స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు దేవదాయ సహాయ కమిషనర్ కె.విజయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. కొంతకాలంగా అన్యాక్రాంతమైన ఈ స్థలానికి సంబంధించిన రికార్డులను పరిశీలించిన అనంతరం సోమవారం జిల్లా దేవదాయ శాఖ అధికారి టీవీఎస్ సుబ్రహ్మణ్యం సమక్షంలో గౌతమీ జీవ కారుణ్య సంఘానికి సంబంధించిన ఆఫీసు సిబ్బందితో కలిసి వెళ్లి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీనిపై ఎవరికైనా ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా మూడు పనిదినాల్లో అనగా గురువారం సాయంత్రంలోగా స్థానిక నారాయణపురం నీళ్ల ట్యాంకులకు ఎదురుగా ఉన్న గౌతమీ జీవకారుణ్య సంఘం కార్యాలయంలో తెలియజేయాలని కోరారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

రాజమహేంద్రవరం రూరల్: పర్యావరణాన్ని కాపాడడం మనందరి బాధ్యత అని ఫారెస్టు బీట్ ఆఫీసర్లు దూడ ఆశారేఖ, పాలేపు మధు మోహన్, అర్చన అన్నారు. సోమవారం స్థానిక వెంకటేశ్వరనగర్ పార్కులో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అక్కడ మొక్కలు నాటారు. వాకర్స్‌కు మొక్కలు పంపిణీ చేశారు.

భోజనం వితరణ

కంబాలచెరువు: స్థానిక ఆదిత్య డిగ్రీ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ వలంటీర్లు సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద 200 మందికి అమ్మా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజనం పంపిణీ చేశారు. నన్నయ వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.జగన్మోహన్‌రెడ్డి దీనికి హాజరయ్యారు. ఆదిత్య కళాశాల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్ ఫణికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు, డాక్టర్ బీహెచ్‌వీ రమాదేవి పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సిలిండర్లతో విజిలెన్స్ అధికారులు

కడియం: స్థానికంగా ఒక రెస్టారెంట్‌లో అక్రమంగా వినియోగిస్తున్న గృహావసర గ్యాస్ సిలిండర్లను విజిలెన్స్ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక సావరం రోడ్డులోని హరే శ్రీనివాస కేటరింగ్ అండ్ రెస్టారెంట్‌లో గృహావసర గ్యాస్ వినియోగిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేయగా 8 సిలిండర్లను గుర్తించారు. ఈ మేరకు రెస్టారెంట్ నిర్వాహకుడు టి.వీర వెంకటరావుపై కేసు నమోదు చేసి, సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌చార్జి రీజనల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.కుమార్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, కానిస్టేబుళ్లు లోవకుమార్, ఈశ్వర్, రెవెన్యూ, సివిల్ సప్లయి అధికారులు ఈ దాడిలో పాల్గొన్నారు.

లోన్‌యాప్‌పై ఫిర్యాదు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసముండే కనకదుర్గ అనే మహిళ నగదు అత్యవసరమై రూపీ పేయాప్‌ను డౌన్‌లోడ్ చేసింది. ఆన్‌లైన్ లోన్ యాప్‌లో తన ఆధార్ కార్డ్, పాన్‌కార్డులను అప్లోడ్ చేసింది. రూపీ పేయాప్ నుంచి నగదు వస్తుందనుకున్న కనకదుర్గకు నిర్వాహకుల నుంచి వేధింపులు మొదలయ్యాయి. లోన్ యాప్ నుంచి తనకు ఎలాంటి డబ్బులు రాలేదని ఆమె చెప్పినప్పటికీ వాళ్లు వినడం లేదు. ఈ నెలాఖరుకు డబ్బులు కట్టకపోతే పరువు తీస్తామని బెదిరించారు. దీంతో బాధితురాలు దిశ ఎస్‌వోఎస్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేసింది. ఈ మేరు బొమ్మూరు పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ట్రాఫిక్ చిక్కుముడి వీడేనా..

- నగరంలో పెరిగిన వాహనాలు
- ఎక్కువైన ప్రజల రద్దీ
- ట్రాఫిక్ నియంత్రణకు అధికారుల చర్యలు



రాజమహేంద్రవరంలో వాహనాల రద్దీ

కంబాలచెరువు: నగరంలోని సమస్యల్లో కెల్లా ప్రధానమైంది ట్రాఫిక్. ఇరుకు రహదారులు, ఎత్తుపల్లాలతో కూడిన రోడ్ల కారణంగా నిత్యం ట్రాఫిక్ చిక్కులు తప్పడం లేదు. దీనికి తోడు ఫుట్‌పాత్‌లు ఆక్రమించిన చిరు వ్యాపారులు రహదారిపై ఏర్పాటు చేస్తున్న తోపుడు బండ్లు ఈ సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. ఆ చిక్కుముడిని విప్పాలంటే అధికారులకు తలకు మించిన పనిగా మారుతోంది. ఎన్ని సంస్కరణలు తీసుకువచ్చినా తిరిగి యథాస్థితికి వస్తుండడంతో తలలు పట్టుకుంటున్నారు. దీంతో శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించేందుకు అధికారులు నడుంబిగించారు.

పెరిగిన వాహనాలు

రాజమహేంద్రవరంలో ట్రాఫిక్ గతంలో కన్నా మరింత పెరిగింది. దీనికి కారణం జిల్లా విభజన తర్వాత రాజమహేంద్రవరం జిల్లా కేంద్రం కావడం, ఇక్కడే కలెక్టర్ కార్యాలయం, ఇతర అధికారుల కార్యాలయాలు కావడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ పనుల మీద నగరానికి వచ్చే వారి తాకిడి ఎక్కువైంది. దీనికి తోడు ఉభయ గోదావరి జిల్లాలకు ప్రధాన వ్యాపార కేంద్రమైన నగరానికి నిత్యం వ్యాపార అవసరాల కోసం వేలమంది వచ్చి వెళుతుంటారు. రాజమహేంద్రవరం, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు నగరాన్ని నిత్యం ఏదో పనిమీద సందర్శిస్తుంటారు. కరోనా విపత్కర పరిస్థితుల తర్వాత కార్ల వినియోగం పెరిగింది. నిత్యం ఏదో ఒక మూల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. దీంతో ట్రాఫిక్‌కు కొంత ఇబ్బంది కలుగుతోంది.

కూడళ్ల వద్ద కానిస్టేబుల్ ఉండేలా...

నగరంలో నిత్యం ట్రాఫిక్ రద్దీతో కొట్టుమిట్టాడే కొన్ని కూడళ్లను ఇప్పటికే పరిశీలించారు. ఆయా కూడళ్లలో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుండటానికి గల కారణాలు, అక్కడ తీసుకోవాల్సిన చర్యలపై మున్సిపల్ అధికారులతో కలిసి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. గతంలో నగర శివారున ఉండే జాతీయ రహదారి ప్రస్తుతం మధ్యలోకి వచ్చింది. ముఖ్యంగా లాలాచెరువు, మోరంపూడి, బొమ్మూరు, వేమగిరి కూడళ్లలో ప్రమాదాలు పెరుగుతున్నాయి. అక్కడ ట్రాఫిక్ సిగ్నల్స్ పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు చేపట్టారు. అలాగే రద్దీగా ఉన్న ప్రాంతాలు, కూడళ్లలో ట్రాఫిక్ కానిస్టేబుళ్లు నిత్యం ఉండేలా చర్యలు చేపట్టారు.

నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

నగరం రోజురోజుకీ అభివృద్ధి చెందుతోంది. దీంతో పాటు నగరానికి వచ్చే ప్రజల సంఖ్య పెరిగిపోయింది. వ్యాపార కేంద్రం నేపథ్యంలో నిత్యం వచ్చే వారితో రోడ్లన్నీ జామ్ అయిపోతున్నాయి. ఈ సమస్యను అధిగమించడానికి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పలు ప్రణాళికలు రూపొందిస్తున్నా. రోడ్లపై, ఇరుకు ప్రాంతాల్లో నిబంధనలకు వ్యతిరేకంగా కార్యకలాపాలు నిర్వహిస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్న వారిపై చర్యలు చేపడతాం. ట్రాఫిక్ క్లియర్ చేయడంలో పూర్తి దృష్టి పెట్టాం. రెండు రోజుల క్రితం జరిగిన తెలుగుదేశం మహానాడే దీనికి ఉదాహరణ. గతంలో ఒంగోలు జరిగిన మహానాడులో తెల్లవారు మూడు గంటల వరకు ట్రాఫిక్ నియంత్రణ చేశాం. అర్ధరాత్రి వరకూ తిప్పలు తప్పవనుకున్న నేపథ్యంలో రాత్రి ఎనిమిది గంటలు పూర్తవకుండానే హైవేలు రెండు పూర్తి క్లియర్ చేశాం.

– ఎం.వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ డీఎస్పీ, రాజమహేంద్రవరం

అర్జీలకు తక్షణ పరిష్కారం



స్పందనలో పాల్గొన్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: స్పందన కార్యక్రమానికి వచ్చిన అర్జీలకు తక్షణమే పరిష్కారం చూపాలని, దరఖాస్తుదారుడికి ఇచ్చే సమాధానం సవివరంగా, సహేతుకంగా ఉండాలని నగర కమిషనర్ దినేష్ కుమార్ ఆదేశాలిచ్చారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు 20 అర్జీలు సమర్పించారు. కమిషనర్ మాట్లాడుతూ ఎండార్సుమెంటు ఇచ్చిన తరువాత దరఖాస్తుదారుడితో మాట్లాడి పరిష్కారం వివరించాలన్నారు. సెక్రటరీలు ఎప్పటికప్పుడు తమ సచివాలయాలకు సంబంధించిన గ్రీవెన్స్ పిటీషన్లను తనిఖీ చేస్తూ, వారి స్థాయిలోనే సంబంధిత అధికారులను సంప్రదించి దరఖాస్తులు ముగించాలని ఆదేశించారు. జగనన్నకు చెబుతాం కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను మొదటి ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్: పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులకు సోమవారం బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభమైంది. ఒకటి నుంచి 12 వేల ర్యాంకు వరకు సర్టిఫికెట్ల పరిశీలనకు 91 మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్, పాలిసెట్ కో ఆర్డినేటర్ వి.నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం 12,001 నుంచి 28 వేలు ర్యాంకు వరకూ పరిశీలన జరుగుతుందన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



వలంటీర్లను సత్కరిస్తున్న నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్లు చేస్తున్న కృషి అభినందనీయమని వైఎస్సార్ సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి, బీసీ సెల్ నగర చైర్మన్ మజ్జి అప్పారావు అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక 37వ డివిజన్‌లో పలువురు వలంటీర్లను సత్కరించారు. డివిజన్‌లోని 72, 73, 74 సచివాలయాల్లో వలంటీర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుడిమెట్ల బాలాజీ రెడ్డి, సోడదాసి సుందర్ సింగ్, సబ్బారపు సూరిబాబు పాల్గొన్నారు.

42వ డివిజన్‌లో..

స్థానిక 42వ డివిజన్ 78, 79, 80 సచివాలయాల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. డివిజన్ ఇన్‌చార్జి నామన వాసు, డీఈ ప్రకాశరావు పాల్గొన్నారు.

గ్యాస్ట్రో, లివర్ వ్యాధులపై అవగాహన

రాజమహేంద్రవరం రూరల్: ది ఏపీ స్టేట్ బేసిక్ మెడికల్ ప్రాక్టీషనర్ అసోసియేషన్ రూరల్ మండల సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. కేఎస్ఎల్ హాస్పిటల్ సహకారంతో స్థానిక ఆర్‌కే రెసిడెన్షియల్‌లో అధ్యక్షుడు తెల్లమేకల సూర్యకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు లంక సత్యనారాయణ, గౌరవ సలహాదారుడు ఆకాశం గౌరీశ్ బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌కే ఇమామ్ పాల్గొన్నారు. కేఎస్ఎల్ హాస్పిటల్ అధినేత డాక్టర్ కేఎస్ ధర్మతేజ మాట్లాడుతూ గ్యాస్ట్రో, లివర్ సంబంధించిన వ్యాధులపై బీఎంపీ సభ్యులకు అవగాహన కల్పించారు. లివర్, పెద్దపేగు క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం, గుండెనొప్పికి గ్యాస్ట్రిక్ నొప్పికి తేడాలను, గాల్ బ్లాడర్‌లో ఏర్పడే రాళ్ల వల్ల వచ్చే నొప్పి గురించి వివరించారు. ఆయా సమయంలో ఏవిధంగా ప్రథమ చికిత్స చేయాలో తెలిపారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌కే సిద్ధా, కోశాధికారి ఆర్.ఈశ్వర్ ప్రభు, ఉపాధ్యక్షులు వీవీ రమణ, బి.సరోజనీదేవి, సంయుక్త కార్యదర్శులు పి.వెంకటేశ్వరరావు, కె.నాగమణి పాల్గొన్నారు.

ఎన్‌సీబీసీ చైర్మన్‌ను కలిసిన పద్మలత



న్యూఢిల్లీలో ఎన్‌సీబీసీ చైర్మన్‌ను కలిసిన అనసూరి పద్మలత

రాజమహేంద్రవరం సిటీ: కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు, కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు రూ.రెండు లక్షల కోట్లకు పెంచాలని, బీసీలకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ పథకం దేశమంతటా అమలు చేయాలని వినతిపత్రం అందజేసినట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ పద్మలత అనుసూరి తెలిపారు. సోమవారం న్యూఢిల్లీలోని ఎన్‌సీబీసీ క్యాంపు కార్యాలయంలో జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్, మాజీ కేంద్ర మంత్రి హన్సరాజ్ గంగారామ్ అహిర్‌ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యతో కలిసి ఆమె వినతిపత్రం అందజేశారు.

నాలుగేళ్లుగా. నలుగురూ మెచ్చేలా..



మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న చందన నాగేశ్వర్ తదితరులు

- సీఎం జగన్ సంక్షేమ పాలనకు నాలుగేళ్లు
- ర్యాలీ నిర్వహించిన చందన నాగేశ్వర్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన నాలుగేళ్ల పాలనలో పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించి నవశకానికి నాంది పలికారని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. సీఎం జగన్ ప్రభుత్వానికి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఆయన ఆధ్వర్యంలో భారీ మోటార్ బైక్‌ర్యాలీ నిర్వహించారు. రూరల్ నియోజకవర్గ కార్యాలయం నుంచి వీఎల్ పురం, మోరంపూడి, బొమ్మూరు, వేమగిరి, ధవళేశ్వరం, ఐఎల్‌టీడీ సెంటర్, రైల్వేస్టేషన్, కోటిపల్లి బస్టాండ్ మీదుగా స్టేడియం రోడ్డు, ఆర్‌టీసీ కాంప్లెక్స్ మీదుగా పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ర్యాలీ ప్రారంభించే సమయంలో వర్షం కుండపోతగా కురిసినప్పటికీ చందన నాగేశ్వర్, పార్టీ నాయకులు, శ్రేణులు ఏమాత్రం లెక్కచేయకుండా ర్యాలీని కొనసాగించారు. మహిళలు సైతం ఈ ర్యాలీలో తమ వాహనాలతో పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే పథకాలు

చందన నాగేశ్వర్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి 98.5 శాతం హామీలను అమలు చేయడం ద్వారా ఎన్నికల మేనిఫెస్టోకు సరికొత్త నిర్వచనం తీసుకువచ్చారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. వేమగిరిలో నిర్వహించిన మహానాడులో చంద్రబాబు ఇచ్చిన హామీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. రాబోయే ఎన్నికలలో రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కడియం మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర, జిల్లా వైఎస్సార్‌టీయూసీ, దివ్యాంగుల సెల్ అధ్యక్షులు ముద్దాల అను, ముత్యాల పోసికుమార్, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి చిన వీరభద్రయ్య, సొసైటీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, మాజీసర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కార్యక్రమానికి తరలివచ్చిన పూర్వ విద్యార్థులు

కడియం: స్థానిక హైస్కూల్లో 2001 -02లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు 21 ఏళ్ల తర్వాత సోమవారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. తోటి వారి క్షేమ సమాచారాన్ని తెలుసుకున్నారు. దాదాపు 80 మంది విద్యార్థులు కుటుంబాలతో తరలి వచ్చి ఆనందంగా గడిపారు. సమ్మేళనానికి కృషి చేసిన మిత్రులు ఎం.సురేష్, చంద్రశేఖర్, కాళ్ల శ్రీను, చల్లా వీరబాబు, షేక్ వలీ, వనుం గంగాభవానీ, మానస, చిక్కాల జ్యోతి, విశాలాక్షిని అభినందించారు.

తండ్రి చెంతకు క్షేమంగా మూగ బాలుడు



బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగించిన జీఆర్పీ పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ: దారి తప్పి వచ్చిన మూగ బాలుడిని జీఆర్పీ పోలీసులు అతడి కుటుంబ సభ్యులకు అప్పగించిన ఘటన రాజమహేంద్రవరం జీఆర్పీ రైల్వే స్టేషన్‌లో జరిగింది. ఈనెల 27న బొకారో ట్రైన్(13352)లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఈ బాలుడిని పోలీసులు గుర్తించి చైల్డ్ కేర్ (1098)కు తరలించారు. కాగా.. నల్గొండ జిల్లా చీకటిమండి కంచర్ల తండాకు చెందిన దీరావంత్ సురేష్ ఈనెల 26న కుటుంబ సభ్యులతో కలసి తిరుమల శ్రీవారి దర్శనానికి బయలు దేరాడు. సాయంత్రం 6 గంటల సమయంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషనులో ట్రైన్ నంబర్ 12734 నారాయణాద్రి రైలు ఎక్కుతున్న సమయంలో అతడి మూడో కుమారుడు దీరావంత్ సందీప్ ట్రైన్ ఎక్కలేదు. గమనించిన సురేష్ రైలు దిగి సికింద్రాబాద్ జీఆర్పీ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా స్టేషన్‌లో సీసీ కెమెరాలు పరిశీలించారు. సందీప్ విశాఖపట్నం వెళ్లే రైలు ఎక్కనట్టు గుర్తించారు. దీంతో సందీప్‌ను వెదుకుతూ కారులో బయలుదేరి విశాఖపట్నం వైపు ప్రతి రైల్వే స్టేషన్‌లో వివరాలు అడుగుతూ సోమవారం రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌కు వచ్చారు. దీంతో చైల్డ్‌లైన్‌కు అప్పగించిన సందీప్‌ను రప్పించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. తమ కుమారుడిని భద్రంగా అప్పగించిన జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ విజయ శంకర్, సిబ్బందికి సందీప్ తండ్రి సురేష్ కృతజ్ఞతలు తెలిపారు.

జనం తక్కువ.. జెండాలు ఎక్కువ



మాట్లాడుతున్న ప్రవీణ్ చౌదరి

ప్రకాశం నగర్: మహానాడులో జెండాలు ఎక్కువ, జనం తక్కువ అని వైఎస్సార్ సీపీ నాయకుడు ప్రవీణ్ చౌదరి అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మామను వెన్నుపోటు పొడిచి పార్టీని లాక్కున్న చంద్రబాబు.. చిల్లర రాజకీయాలు చేస్తున్నారంటూ ఆరోపణలు చేయడం సిగ్గుచేటు అన్నారు. 15 లక్షల మంది జనం వస్తారని చెప్పిన సభకు కనీసం 15 వేల మంది కూడా రాలేదన్నారు. రాజమహేంద్రవరంలో జరిగిన మహానాడు చంద్రబాబుకు వీడ్కోలు సభగా అభివర్ణించారు. ఆయనను నమ్మేస్థితిలో ప్రజలు లేరన్నారు.

మహానాడు విజయవంతం

సీటీఆర్ఐ: తెలుగుదేశం పార్టీ మహానాడు విజయవంతమైందని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, పార్టీ కార్యకర్తల సంక్షేమ విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్‌గా శిష్ట లోహిత్ అన్నారు. అర్బన్ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహానాడు, ఎన్‌టీఆర్ శత జయంతి ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయన్నారు.

మహాసేన రాజేష్ వ్యాఖ్యలు అర్థరహితం



మాట్లాడుతున్న బర్రే కొండబాబు

ప్రకాశం నగర్: 80 శాతం మంది దళితులు చంద్రబాబు నాయుడుతో ఉన్నారని మహాసేన రాజేష్ మాట్లాడడం అర్థరహితమని మాజీ స్టాండింగ్ కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు బర్రే కొండబాబు మండిపడ్డారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అని దళితులను అహంకారపూరితంగా అవమానించిన చంద్రబాబు నాయుడి ఒళ్లంతా విషమని దుయ్యబట్టారు. రాజమహేంద్రవరం అభివృద్ధికి కృషి చేస్తున్న ఎంపీ మార్గాని భరత్ రామ్‌ను రాజేష్ విమర్శించడం తగదన్నారు. బీసీలకు ఎంతో చేశానని చెప్పుకుంటూ తిరిగే చంద్రబాబు రాజమహేంద్రవరం ఎంపీ సీటును ఏనాడూ బీసీలకు కేటాయించాలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను చంద్రబాబు మోసం చేస్తే.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వారికి తగిన గుర్తింపు ఇచ్చి పదవులు కట్టబెట్టారన్నారు. చంద్రబాబు మోసంపై 20 రోజులలో బహిరంగ చర్చకు వస్తే తాను సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. మార్తి నాగేశ్వరరావు, గారా త్రినాథరావు, ఏనుగుపల్లి రామకృష్ణ, గారా చంటి, కార్తీక్ సింగంపల్లి పాల్గొన్నారు.